క్లుప్తంగా

నేటి నుంచి వేడుకలు

భూత్పూర్‌: మండలంలోని అన్నాసాగర్‌లో గురువారం నుంచి శనివారం వరకు ఆంజనేయ స్వామి ఆలయ పునఃప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజక వర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాలకు టీవీ వితరణ



దేవరకద్ర: బస్వాపూర్‌ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సర్పంచ్‌ హన్మంతు బుధవారం స్మార్ట్‌ టీవీని అందజేశారు. డిజిటల్‌ సిస్టంలో విద్యార్థులు చదువుకోవడానికి టీవీ ఉపయోగపడుతుందని అన్నారు. హెచ్‌ఎం సురేందర్‌, కార్యదర్శి రాజేశ్‌, ఉపసర్పంచ్‌ రాజేందర్‌గౌడ్‌, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్‌గౌడ్‌



జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన కె. రాజశేఖర్‌గౌడ్‌ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజ్‌గౌడ్‌ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ గౌడ్‌ను పలువురు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

కేసీఆర్‌ చిత్రపటానికి పాలాభిషేకం

దేవరకద్ర: బస్వాపూర్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. కోయిల్‌సాగర్‌ రోడ్డు నుంచి నార్లోనికుంట్ల, బస్వాపూర్‌ గ్రామాలకు బీటీ రోడ్డు వేయడానికి రూ. 1.60 కోట్లు మంజూరు పై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీపీ రమాదేవి, సర్పంచ్‌ హన్మంతు నాయకులు పాల్గొన్నారు.

నేడు విగ్రహావిష్కరణ

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): సర్వాయిపాపన్నగౌడ్‌ విగ్రహావిష్కరణ గురువారం నిర్వహించనున్నట్లు గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్‌ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వివరించారు. అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం జయంతి వేడుకలు ఉంటాయని వివరించారు.

పండ్ల పంపిణీ



భూత్పూర్‌: పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆమ్‌ ఆద్మీ నియోజక వర్గ ఇన్‌చార్జ్‌ ఎల్లప్ప రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కేజ్రీవాల్‌ జన్మదినం పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డా.అబ్దుల్‌ రబ్‌, సిబ్బంది పాల్గొన్నారు.

డిక్షనరీల అందజేత



బాలానగర్‌: నేరళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 75 మంది విద్యార్థులకు బుధవారం డిక్షనరీలు పంపిణీ చేశారు. పూర్వపు విద్యార్థి వేణుకుమార్‌, తదితరులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

రాజాపూర్‌ ఎంపీఓకు సన్మానం

రాజాపూర్‌: రాజాపూర్‌ ఎంపీఓ వెంకట్‌రాములును బుధవారం మండల ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఏపీఓ భారతి, పంచాయతీ కార్యదర్శులు శాలువాతో ఘనంగా సన్మానించారు. విధినిర్వహణతో ఉత్తమ ఎంపీఓగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌, జిల్లా కలెక్టర్‌ రవినాయక్‌ చేతుల మీదుగా అవార్డు అందుకోవడంతో కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీనారాయణ, విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.



కుష్టు నిర్మూలనకు కృషి



నవాబుపేటలో సర్వే ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి కృష్ణ



మిడ్జిల్‌లో..

నవాబుపేట: కుష్టు రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని, వైద్య సిబ్బందికి సహకరించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాధిగ్రస్తుల గుర్తింపు అనంతరం వారికి కావాల్సిన మందులు డోర్‌డెలివరీ ద్వార అందించాలన్నారు. తద్వారా వ్యాధిని కంట్రోల్‌ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. తీవ్రతను బట్టి మందుల మోతాదు ఉంటుందన్నారు. క్రమంగా వాడి, వైద్య సిబ్బంది సూచనలు పాటిస్తే కుష్టు రహిత సమాజం ఎందోదూరంలో ఉండదని వివరించారు. వ్యాది లక్షణాలు ఉంటే వెంటనే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ నెల 31 వరకు సర్వే ఉంటుందన్నారు. సింగిల్‌విండో చైర్మన్‌ నర్సింహులు, మార్కెట్‌ చైర్మన్‌ లక్ష్మయ్య , సర్పంచ్‌ గోపాల్‌గౌడ్‌, మండల వైద్యాధికారి డాక్టర్‌ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్‌: కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో వైద్యాధికారిణి మనుప్రియా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది దేవయ్య, జంగయ్య, మరియమ్మ, రాజేశ్వరి, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

దేవరకద్ర: మండల తహసీల్దార్‌గా శ్రీనివాసరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన వికారాబాద్‌ జిల్లాలో పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్‌ జ్యోతి వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు.

భూత్పూర్‌: నూతన తహసీల్దార్‌గా భానుకిరణ్‌ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు మిడ్జిల్‌ డిప్యూటీ తహసీల్దార్‌ గీత 12 రోజుల పాటు ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. కాగా భానుకిరణ్‌ మహబూబ్‌నగర్‌లోని భీమా ప్రాజెక్టు కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు.

మహమ్మదాబాద్‌: మండల తహసీల్దార్‌గా యేసయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఆంజనేయులు బదిలీపై సివిల్‌సప్లై డిపార్ట్‌మెంట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు ఘనంగా సన్మానించారు. డీటీ చంద్రశేఖర్‌, ఆర్‌ఐ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

గండేడ్‌: మండల తహసీల్దార్‌గా నాగలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రజలు స్వాగతం పలికారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేకపూజలు



మూసాపేటలోని అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని సంకల్పసిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రంలో అమావాస్యను పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. సంకల్పసిద్ధి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో కుమారస్వామి, అయ్యప్ప స్వామి విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో అఖండ దీపారాధనను ప్రారంభించారు. సేవాసమితి అధ్యక్షుడు తిరుపతయ్యగౌడ్‌, గొపని కొండయ్య, విశ్వేశ్వర్‌నాథ్‌, మధు, శ్రీనివాసులు, నగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో అన్నదానం

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అమవాస్యను పురస్కరించుకొని స్థానిక అశోక్‌టాకీస్‌ చౌరస్తాలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్‌ చైర్మన్‌ నర్సింలు, వైస్‌ చైర్మన్‌ గణేష్‌ ప్రారంభించారు. కౌన్సిలర్‌ రామ్‌, ప్రచారసమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్‌, సభ్యులు, గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌

కూచూర్‌లో..

నవాబుపేట: కూచూర్‌లో బుధవారం పెరుమల్ల ఆంజనేయస్వామి, శివాలయాల్లో అమవాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేశారు. లోకిరేవు వీరభద్రస్వామి ఆలయంలోనూ పూజలు నిర్వహించారు. సర్పంచ్‌ లక్ష్మమ్మ, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, రవి, బోజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పల్లెబాట

హన్వాడ: ఇబ్రహీంబాద్‌లో బుధవారం బీజేపీ నాయకులు పల్లెబాట నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండాబుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఎంపీటీసీ లక్ష్మి, అంజిల్‌రెడ్డి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్తీబాట

జడ్చర్ల టౌన్‌: రాష్ట్రశాఖ పిలుపు మేరకు బీజేపీ నాయకులు బస్తీబాట చేపట్టారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు బుడగజంగాల కాలనీలో పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కౌన్సిలర్‌ రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌, నాయకులు మధు, అమర్‌నాథ్‌గౌడ్‌, వెంకట్‌, జగదీశ్‌, జ్యోతి, అంజలి, శివ, సందీప్‌ పాల్గొన్నారు.



పల్లెబాటలో పాల్గొన్న నాయకుల

వాజ్‌పేయికి ఘన నివాళి



భూత్పూర్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

భూత్పూర్‌: పట్టణంలోని చౌరస్తాలో బుధవారం మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. మండల బీజేపీ నాయకులు ఘనంగా నివాళిలర్పించారు. ఆయన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.సుదర్శన్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు రవీందర్‌, ప్రధాన కార్యదర్శులు పట్నం శ్రీను, సదానంద్‌ తదితరులు ఉన్నారు.

జడ్చర్ల టౌన్‌: మండలకేంద్రంలోమాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి నిర్వహించారు. ఘనంగా నివాళిలర్పించారు. ఆయన సేవలు కొనియాడారు.

కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సామల నాగరాజు, కౌన్సిలర్‌ కుమ్మరి రాజు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, మధు, అమర్‌నాథ్‌, జ్యోతి, అంజలి, భరత్‌గౌడ్‌, కిట్టు శేఖర్‌, చారి, సందీప్‌ పాల్గొన్నారు.



జడ్చర్లలో..

విధుల్లో చేరిన 8 మంది ఉద్యోగులు

భూత్పూర్‌: ప్రభుత్వం ఇటీవల వీఆర్‌ఏలకు వివిధ హోదాల్లో ఉద్యోగాలు కల్పించిన విషయం విదితమే ఈ నేపథ్యంలో భూత్పూర్‌ తహసీల్దార్‌ కార్యాలయానికి వివిధ జిల్లాల నుంచి 10 మందిని కేటాయించారు. వీరిలో 8 మంది బుధవారం విధుల్లో చేరినట్లు తహసీల్దార్‌ భానుకిరణ్‌ తెలిపారు. రికార్డు అసిస్టెంట్లుగా ముగ్గురు, మండల సర్వేయర్‌కు అసిస్టెంట్లుగా చైన్‌మెన్లు ఇద్దరు, అటెండర్‌ ఒకరు, ఇద్దరు జూనియర్‌ అసిస్టెంట్లు విధుల్లో చేరినట్లు వివరించారు.

సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్యలు

బాలానగర్‌: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌ పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలతో 3 ఫేస్‌ విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు బుధవారం డీఈ కృష్ణమూర్తి తెలిపినట్లు బాలానగర్‌ ఏఈ చంద్రశేఖర్‌ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు గంగాపూర్‌, కొండేడ్‌, కోడ్గల్‌, బాలానగర్‌, రాజాపూర్‌, నవాబ్‌పేట్‌ మండలాల్లో రైతులకు రాత్రి వేళల్లో సరఫరా అయ్యే 3 ఫేస్‌విద్యుత్‌లో అంతరాయం ఉంటుందన్నారు. విషయాన్ని గుర్తించి రైతులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జీఓ విడుదలపై హర్షం

చిన్నచింతకుంట: మండలంలో జూనియర్‌ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం బుధవారం జీఓ విడుదల చేసింది. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌, మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జడ్చర్ల టౌన్‌: కావేరమ్మపేట భక్తమార్కండేయ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాశీ విశ్వనాథ్‌, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, ఎల్లరామస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు శ్రీధర్‌ తదితరులు ఎన్నికయ్యారు.

ఓటింగ్‌ ప్రకియపై అవగాహన

జడ్చర్ల టౌన్‌: మండలంలోని నాగసాల వద్ద ఉన్న స్వామినారాయణ గురుకుల పాఠశాలలో బుధవారం ఓటు ప్రాధాన్యత, దాని వినియోగం గురించి అవగాహన కల్పించేలా ఇన్వెస్టిట్యూర్‌ సెర్మనీ నిర్వహించారు. ఎన్నికల ప్రామాణిక పద్ధతులను అనుసరించి ఓటింగ్‌ ప్రక్రియ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు అమరేందర్‌ రెడ్డి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బ్రహ్మవిద్య సెంట్రల్‌ ఆఫీస్‌ కోఆర్డినేటర్‌ వెంకటరామిరెడ్డి చేత ప్రమాణ స్వీకారోత్సవం చేయించారు. పాఠశాల డైరెక్టర్‌ భావిష్‌ అక్షర, భగత్‌ కల్పేష్‌, భగత్‌జి, సీసీఈ ఇన్‌చార్జ్‌ సాకేత్‌ప్రవీణ్‌, కో ఆర్డినేటర్‌ రాఘవాదిత్య పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యం చేరుకోవాలి



బాలానగర్‌: గ్రామాల్లో చేపట్టిన హరితహారం పకడ్బందీగా అమలు చేయాలని మండల ప్రత్యేక అధికారి బాబురావ్‌ అన్నారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్‌ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఇటీవలే ప్రతి గ్రామంలో పల్లె క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసేందుకు భూమిని కేటాయించినా అన్ని గ్రామాల్లో ఇంకా పూర్తి కాలేదని అన్నారు. వెంటనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలు వర్షాలు లేక ఎండిపోయే పరిస్థితి ఉందని, ట్యాంకర్ల ద్వారా నీరు పోయాలని ఆదేశించారు. గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న జీపీ భవనాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అదేవిధంగా మండల పరిధిలో ఒక్క రోజులో 24 వేల మొక్కలు నాటేందుకు ఆదేశించారని ప్రతి గ్రామంలో 700లకు తక్కువ కాకుండా సిద్ధం చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణారావు, తహసీల్దార్‌ శ్రీనివాస్‌ రెడ్డి, ఏపీఓ రాజశేఖర్‌, ఏఈ హలీం తదితరులు ఉన్నారు.

పెచ్చులూడుతున్న పాఠశాల పైకప్పు



ప్రహరీ లేని కుచ్చర్‌కల్‌ పాఠశాల

రాజాపూర్‌: మండలంలోని కుచ్చర్‌కల్‌ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఏళ్ల క్రితం నిర్మించారు. కాగా ప్రస్తుతం పాఠశాల భవనంపై కప్పు పెచ్చులూడిపడుతోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లదీస్తున్నారు. కొందరు విద్యార్థులు పాఠశాలకు రావడానికే జంకుతున్నారు. పాఠశాలలో ఏడో తరగతి వరకు మొత్తం 74 మంది విద్యార్థులు ఉన్నారు. చినుకు పడిదంటే తరగతి గదులు అన్ని కురుస్తున్నాయని అంటున్నారు. స్లాబ్‌ పెచ్చులు ఊడిపడిపోతున్నాయని వాపోతున్నారు. సమస్యపై ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని, బడికి పంపాలంటే భయంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. అంతేకాకుండా బీటీ రోడ్డు పక్కనే పాఠశాల ఉండటంతో, ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. మన ఊరు..మన బడి కింద రెండోఫేస్‌లోనైనా పాఠశాలను చేర్చి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న భవనం పైకప్పు

తరగతిలో కూర్చోవాలంటే భయమేస్తోంది

పాఠశాల పైకప్పు ఎప్పుడు కూలిపడుతుందో అని భయమేస్తోంది. తరగతి గదిలో బిక్కుబిక్కు మంటూ కూర్చుంటున్నాం. ఇప్పటికైనా కొత్త పాఠశాల భవనం నిర్మిస్తే బాగుంటుంది.

– అక్షయ, ఏడో తరగతి విద్యార్థి

ప్రహరీ నిర్మించాలి

పాఠశాలకు ప్రహరీలేదు. పక్కనే బీటీరోడ్డు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయమేస్తోంది. విద్యార్థులను ఆటల సమయంలో బయటకు పంపించాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. పాఠశాల తరగతి గదులు సైతం ప్రమాదకరంగా ఉన్నాయి. నూతన భవనం నిర్మిస్తే బాగుంటుంది.

– హెఫ్సిబా, ఉపాధ్యాయురాలు

'మన ఊరు- మనబడి'లో చేర్చాలి

పాఠశాలలో తరగతి గదులు పెచ్చులూడుతున్నాయి. ప్రహరీ సైతం లేదు. అనేక సమస్యలు ఉన్నాయి. ప్రభుత్వం మా పాఠశాలను మన ఊరు– మనబడిలో చేర్చాలి. తద్వారా పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలి. తరగతి గదులు, ప్రహరీ ఇతర వసతులు కల్పించాలి.

– సమత, ప్రధానోపాధ్యాయురాలు

'ఓర్వలేకనే కేసులు పెట్టారు'

జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): ప్రజా క్షేత్రంలో తమ పార్టీ గెలుపును చూసి ఓర్వలేకనే కొందరు తప్పుడు కేసులు వేశారని, తీరా అభాసుపాలయ్యారని మున్సిపల్‌ చైర్మన్‌ నర్సిములు అన్నారు. 2020లో తప్పుడు అఫిడవిట్‌ దాఖలు చేసి ఎన్నికల్లో గెలిచినట్లు కాంగ్రెస్‌ నాయకుడు రాఘవేందర్‌రాజు వేసిన కేసులో తామే విజయం సాధించినట్లు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల పరిధిలో ఓడిపోయిన అభ్యర్థులు ఇలాంటి తప్పుడు కేసులు పెట్టారని అన్నారు. నిరాధారమైన ఆరోపణలు ఉన్నాయని కోర్టు కేసు కొట్టివేసిందని వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ లీగల్‌ సెల్‌నాయకుడు విక్రందేవ్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ గణేష్‌, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

7 నెలలుగా గౌరవవేతనం అందలే!

జడ్చర్ల టౌన్‌: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట ఏజన్సీ మహిళలు తమకు నెలకు ఇచ్చే గౌరవ వేతనం వెంటనే ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. 7నెలలుగా గౌరవ వేతనం ఇవ్వకపోగా నాలుగు నెలల నుంచి గుడ్ల డబ్బులు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. విషయాన్ని స్థానిక ఎంఈఓ, జిల్లా కలెక్టర్‌కు మూడు రోజుల క్రితం వివరించారు. త్వరలోనే డబ్బులు వస్తాయని వారు భరోసా ఇచ్చారు. అయితే అప్పటి వరకు తాము గుడ్లు పెట్టలేమని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు తెలియజేగా తప్పనిసరిగా పెట్టాలని వారు చెప్పటంతో ధర్నాకు దిగారు. డబ్బులు వచ్చే వరకు గుడ్లు పెట్టలేమని ధర్నాలో ప్రకటించారు. ధర్నాకు స్పందించిన పోలీసులు ఉన్నతాధికారులతో మాట్లాడతామని విరమింపజేశారు.

సాధనతో ఏదైనా సాధ్యమే



జడ్చర్ల టౌన్‌: ప్రస్తుత సమాజంలోని కుటుంబాలలో ప్రేమ, ఆప్యాయతలు తగ్గిపోయి ఒంటరి తనం అనుభవించాల్సి వస్తుందని, అయితే సాధన ద్వారా తిరిగి అన్ని పొందవచ్చని బ్రహ్మకుమారీస్‌ రాజయోగిని శక్తి అక్కయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని బ్రహ్మకుమారీస్‌ ఈశ్వరీయ కార్యాలయంలో మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలి ఎన్‌పవర్‌మెంట్‌లో ఆమె పాల్గొని సందేశమిచ్చారు. గతంలో సమిష్టి కుటుంబాల్లో అనేక విషయాలు నేర్చుకునే ఆస్కారం ఉండేదని, ఒకరు తప్పుచేసినా దానిని సరిదిద్దుకునే వెసులుబాటు ఉండేదన్నారు. నేడు ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుల పేరిట చిన్న కుటుంబాలుగా విడిపోవాల్సి వచ్చిందని దీనివల్ల ఒంటరితనం అనుభవించాల్సి వస్తుందన్నారు. దానిని దూరం చేసుకునేందుకు మనసులో చెడు సంకల్పం రాకుండా చూసుకుంటూ అందరితో ప్రేమ, ఆప్యాయతలతో కలసి మెలసి ఉండేందుకు పాటు పడాలన్నారు. సహజరాజయోగ అభ్యాసం ద్వారా ఇది సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్‌ పాలాది సారిక, ప్రముఖులు వీణశివకుమార్‌, గోవర్ధని, డా.గాయత్రి, పావని, రాధ, సుజ్ఞాని, ప్రభ పాల్గొన్నారు.